క్లుప్తంగా

సుగుణకు టికెట్ ఖరారుపై హర్షం



టపాసులు కాలుస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

జైనూర్: ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సుగుణకు అధిష్ఠానం టికెట్ ఖరారు చేయడంపై పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించి, టపాసులు కాల్చారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముఖీద్ మాట్లాడుతూ సుగుణక్కను గెలిపించేలా కార్యకర్తలు పనిచేయాలన్నారు. బ్లాక్ అధ్యక్షుడు ఆయ్యుబ్‌ఖాన్, నాయకులు సుద్దాల శ్రీనివాస్, ఆనంద్, ఇస్లాం , పెందూర్ ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలి



వాహనం తనిఖీ చేస్తున్న డీఎస్పీ సదయ్య

వాంకిడి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని డీఎస్పీ సదయ్య అన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది అప్రమత్తంగా ఉండి మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే, వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. అలాగే గంజాయి, మద్యం, రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వాహనాల రాకపోకలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఎస్సై సాగర్, సిబ్బంది ఉన్నారు.

టీబీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

కౌటాల: మండలంలోని వీర్దండి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో టీబీపై గ్రామస్తులకు వైద్య సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ టీబీ వ్యాధి పై అవగాహన ఉండాలన్నారు. తరుచూ దగ్గు వస్తే తప్పనిసరిగా టీబీ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. టీబీ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం జి.సునీత, ఉపాధ్యాయులు రాములు, ఆశవర్కర్ పెందోర్ అర్చన, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక

కాగజ్‌నగర్‌రూరల్/రెబ్బెన:తమిళనాడులోని కోయంబత్తూరులో ఈనెల 29 నుంచి 31 వరకు జరిగే జాతీయస్థాయి యోగా పోటీలకు పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ స్కూల్ పీఈటీ యోగి ఎంపికైనట్లు తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు తెలిపారు. 44–45 ఏళ్ల విభాగంలో రాష్ట్రం నుంచి యోగి పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా యో గిని జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్, ఫాతిమా కాన్వెంట్ ప్రిన్సిపాల్ సఫాల్య, ఆర్గనైజింగ్‌సెక్రటరీ అలేఖ్య, కోశాధికారి ఓదెలు అభినందించారు.

దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ విద్యాలయాల్లో 2024–25 విద్యాసంవత్సరానికిగాను ఖాళీగా ఉన్న సీట్ల దరఖాస్తులకు గడువు పొడగించినట్లు ఆసిఫాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ ఉటూరి శ్రీనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. 6,7,8,9వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లు (బ్యాక్‌లాగ్ వేకెన్సీలు) భర్తీకి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం www.tswreis.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్నవారికి ఏప్రిల్ 21వ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రత్యేక పరీక్ష ఉంటుందని తెలిపారు.

పండ్ల రసం పంపిణీ

పెంచికల్‌పేట్: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు గురువారం పండ్ల రసం పంపిణీ చేశారు. ఎండలు దృష్టిలో పెట్టుకుని పరీక్ష కేంద్రం వద్ద ప్రతీరోజు పండ్ల రసం పంపిణీ చేస్తున్నట్లు నగునూరి శ్రీనివాస్ తెలిపారు. ఉపాధ్యాయులు సుమతి, గోపాల్, అనిల్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- పిట్టగోడ లేని హట్టి ఘట్ రోడ్డు
- నిత్యం వాహనాల రాకపోకలు
- ఆందోళన చెందుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



పిట్టగోడ లేక ప్రమాదకరంగా హట్టి ఘాట్ రోడ్డు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్ వైపు వెళ్లే హట్టి ఘాట్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. ఈ దారి గుండా నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పిట్టగోడ లేక హట్టి ఘాట్‌రోడ్డు ప్రమాదకరంగా ఉండడంతో ఎప్పుడేం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడైతే ఘాట్ రోడ్డు..మూలమలుపులు ఉంటాయో అక్కడ ఇరుపక్కల పిట్టగోడలు నిర్మించాల్సి ఉన్నా అధికారులు ఏళ్ల నుంచి పట్టించుకోవడం లేదు. జోడేఘాట్ నుంచి వచ్చే వేళ సుమారు అర కిలోమీటరు పూర్తిగా డౌనల్ ప్రాంతం ఉంది. రాకపోకలు సాగించే వాహనాలు సైతం ఇబ్బంది తప్పేలా లేదు. అది కాక ఆ దిగువ ప్రాంతంలో రోడ్డు కుడిపక్కన పూర్తిగా లోయ ఉండడంతో వేగంగా వచ్చి అందులో పడే అవకాశం ఉంది. మరోవైపు ఆ ప్రాంతంతో బీటీ కాకుండా సిమెంట్ రోడ్డు వేసి ఉండడంతోపాటు.. చాలాచోట్ల గుంతలు పడి ఉన్నాయి. అనేకసార్లు అక్కడ వాహనాలు జారిపడ్డ సందర్భాలున్నాయి. అయినా అధికారుల్లో ఎలాంటి చలనం లేదు.

12 గ్రామాలు.. ఎనిమిది మూలమలుపులు

మండలంలోని జోడేఘాట్ వైపునకు పిట్టగూడ, టోకెన్‌మోవాడ్, చాల్‌బాడి, పాటాగూడ, శివగూడ, లైన్ పటార్, చిన్న, పెద్ద పాట్నాపూర్, కొలాంగూడ, జోడేఘాట్ తదితర మొత్తం 12 గ్రామాలు ఉన్నాయి. వారు ప్రతినిత్యం ఏవో పనుల నిమిత్తం కెరమెరికి వస్తుంటారు. ఈ క్రమంలో హట్టి ఘాట్ రోడ్డు తప్ప వేరే మార్గం లేదు. ఈ దారిలో 8 మూల మలుపులు ఉన్నాయి. ప్రైవేటు వాహనాలు ప్రతీరోజు రాకపోకలు సాగిస్తుంటాయి. మూలమలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు కూడా లేవు. ఈక్రమంలో ఎప్పుడేం ప్రమాదం వాటిల్లుతుందోనని వారు భయపడుతున్నారు. అధికారులు స్పందించి ఘాట్ రోడ్డుపై పిట్టగోడలు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



జోడేఘాట్‌కు వెళ్లే బీటీ రోడ్డు ఇదే



అతి సమీపంలో ఉన్న మూల మలుపులు

పట్టించుకోవాలి



ఏళ్ల నుంచి రోడ్డు ఉన్నప్పటికి హట్టి ఘాట్‌పై ప్రమాద సూచికలు లేవు. పిట్టగోడ లేకపోవడంతో వాహనాలు నేరుగా గోయలో పడే అవకాశం ఉంది. అధికారులు పట్టించుకుని వెంటనే చర్యలు చేపట్టాలి.

– రాథోడ్ నిరంజన్‌దాస్, బాబేఝరి

పిట్టగోడలు నిర్మించాలి



ప్రతీ ప్రయాణం చేస్తున్న ప్రజలు భయంభయంగా ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి. మూలమలుపులు ఉండడంతో దిగే వేళ డౌనల్ ప్రాంతంగా ఉంది. అధికారులు స్పందించి పిట్టగోడలు నిర్మించేలా చర్యలు చేపట్టాలి.

– సిడాం మానిక్‌రావు, శివగూడ

పోలింగ్ నిర్వహణపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ నిర్వహణపై ట్రైనర్లు ఎన్నికల సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం మాస్టర్ ట్రైనర్లకు శిక్షణలో భాగంగా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజు అధికారులు ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా చూడాలన్నారు. పీవో, ఏపీవోలు ఇతర పోలింగ్ సిబ్బందికి ప్రతి అంశంపై మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించాలన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్ల గురించి వివరించాలన్నారు. అనంతరం మాక్‌పోలింగ్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లకు ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్లు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని గురువారం ఆదిలాబాద్ కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రాల నగేశ్, ఉపాధ్యక్షురాలుగా రజిత రెడ్డి, జనరల్ సెక్రెటరీగా సంతోష్ కుమార్, స్పోర్ట్స్ సెక్రెటరీగా ముజాహిద్ హుస్సేన్, జాయింట్ సెక్రెటరీగా రాహుల్ వాఘ్మరే, కోశాధికారిగా రమణయ్య, మహిళ ప్రతినిధిగా తిలోత్తమలు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ముసుగు రమణా రెడ్డి, వినోద్ రెడ్డి, భవన సింగ్‌లు వ్యవహరించారు.

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాపురెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ధీరజ్‌కుమార్ గుప్తా, జనరల్ సెక్రటరీగా జగన్ బానోత్, జాయింట్ సెక్రటరీగా పవార్ వసంత్ రావు, కోశాధికారిగా చింతల గిరి, స్పోర్ట్స్ సెక్రటరీగా శ్రీనివాస్, లైబ్రరీ కార్యదర్శిగా జైవంత్‌రావులను ఎన్నుకున్నారు.

కథల పుస్తకాలతో పిల్లల్లో పఠనాసక్తి



విద్యార్థులకు బోధిస్తున్న హెచ్‌ఎం కోల మహేశ్

రెబ్బెన: కథల పుస్తకాలతో పిల్లల్లో పఠనాసక్తి పెరుగుతుందని రేకులగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కోల మహేశ్ అన్నారు. గురువారం ఆ పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలను ఉపయోగించి పఠనకృత్యాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో నాటకీకరణ, ఏకపాత్రాభినయం, సొంత మాటలు చెప్పడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. రూం టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ఇటీవల పాఠశాలకు 261 కథల పుస్తకాలు అందించినట్లు హెచ్‌ఎం తెలిపారు. 1, 2వ తరగతుల పిల్లలతో అభ్యాసన దీపికలను ప్రాక్టీస్ చేయించారు. ఆటాపాటలతో పిల్లలకు అక్షరాలు, పదాలు నేర్పించడం వంటి కృత్యాలను చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రవీందర్ పాల్గొన్నారు.

‘నేతకాని సమాజానికి క్షమాపణ చెప్పాలి’



మాట్లాడుతున్న దుర్గం శేఖర్

ఎదులాపురం: నేతకాని సామాజిక వర్గాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన గుమ్మడి కుమార స్వామి తమ సామాజిక వర్గానికి వెంటనే క్షమాపణ చెప్పాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం శేఖర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. గుమ్మడి కుమార్ స్వామి నేతకాని జాతికి నీతి లేదంటూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తమ మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బహిరంగ క్షమాపణ చెప్పకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్ మహాత్మే, జిల్లా మహిళా కోఆర్డినేటర్ జాడి విఠాబాయి, యువజన అధ్యక్షుడు రాహుల్ జాందడే, కార్యదర్శి సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

తలమడుగు: గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ధనశ్రీ హెచ్చరించారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎవరూ కూడా గ్రామాల్లో మద్యం, కల్తీకల్లు, ఇతర మత్తు పదార్థాలు విక్రయించరాదన్నారు. రూ. 50 వేలకు పైగా నగదు తీసుకెళ్లవద్దన్నారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం విక్రయించినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గోలేటి విలేజ్ అభివృద్ధికి తోడ్పాటునందించాలి



జీఎం రవిప్రసాద్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

రెబ్బెన: ఏరియాలోని గోలేటి విలేజ్ గ్రామ అభివృద్ధికి సింగరేణి యాజమాన్యం తోడ్పాటునందించాలని గురువారం గ్రామస్తులు ఏరియా జీఎం రవిప్రసాద్‌ను కోరారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో గోలేటికి చెందిన సేవాలాల్ దీక్ష స్వాములు జీఎంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోలేటి విలేజ్‌లోని యువత కోసం సింగరేణి ప్రత్యేకంగా లైబ్రరీని ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల నియామకంలో గోలేటిలోని నిరుద్యోగులకు అవకాశం కల్పించాలన్నారు. అలాగే జగదాంబ ఆలయం వద్ద తాగునీటి సౌకర్యం కోసం ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి షెడ్డు, ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. గ్రామస్తులు అజ్మీర బలరాం నాయక్, లావుడ్య దుప్పానాయక్, మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు, లావుడ్య లోకయ్య, గుగులోత్ రవినాయక్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా వాటర్ ట్యాంకులు

కెరమెరి: మండలంలోని 38 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.లక్ష నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా మారాయి. నిర్మించి ఏడాదికి పైగా గడుస్తున్నా ట్యాంకుల్లో నీరు సరఫరా చేయలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ ట్యాంకులను వినియోగంలోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: దివ్యాంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా దివ్యాంగ నిరుద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సలీం ఆ సంఘం నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ ఖమర్ హైమద్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఆదిలాబాద్ మున్సిపల్ బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి 5 శాతం నిధులు కేటాయించాలని కోరారు. రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగాలను కేటాయించాలని విన్నవించారు. అదే విధంగా తాము ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేశ్, సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో రాణించడం అభినందనీయం

ఉట్నూర్‌రూరల్: నేటి యువత సామాజిక సేవలో రాణించడం అభినందనీయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఖయ్యుం అన్నారు. గురువారం లక్కారం గ్రామంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో యువ నాయకులు అజ్మీర జయచంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి కాలం దృష్ట్యా వివిధ ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కలీం పాషా, హైమద్, గ్రామస్తులు రఘు, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తండ్లాట

- భీమ్‌రెల్ల గ్రామంలో తీవ్రంగా నీటి ఎద్దడి
- ఇబ్బంది పడుతున్న ఆదివాసీలు



అలంకారప్రాయంగా మిషన్ భగీరథ ట్యాంకు



ఎడ్లులకు కర్రెలు కట్టి డ్రమ్‌లో నీటిని తీసుకువస్తున్న ఆదివాసీ

తిర్యాణి: చుట్టూ పచ్చటికొండల మధ్య విసిరేసినట్లుగా ఉండే భీమ్‌రెల్ల గ్రామంలో ఆదివాసీలు తాగునీటికి తండ్లాట పడుతున్నారు. మండలంలోని ముల్కల్లమంద పంచాయతీ పరిధిలోని భీమ్‌రెల్ల గ్రామంలో 13 ఆదివాసీ కుటుంబాలు ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాయి. ఇప్పటికి తాగునీటికి అష్టకష్టాలు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆదివాసీలు వాపోతున్నారు.

అందని ‘భగీరథ’

భీమ్‌రెల్ల గ్రామంలో 50 మందికి పైగా జనాభా నివసిస్తున్నారు. కానీ ఇప్పటి ఆ గ్రామానికి ఒక్కటి అంటే ఒక్క బోర్‌వెల్ వేయలేదు. ఇంటింటికీ మంచినీరు అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన మిషన్ భగీరథ పథకంలో భాగంగా ఆ గ్రామానికి పైప్‌లైన్ వేయడంతోపాటు రూ.లక్షలు వెచ్చించి వాటర్ ట్యాంకు నిర్మించారు. కానీ ఆ నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో ట్యాంక్ ప్రారంభానికి ముందే పగుళ్లు తేలింది. పైప్‌లైన్ లీకేజీ అవడంతో ఆ గ్రామానికి ట్రయల్ రన్ సమయంలో ఇచ్చిన నీటిని తప్ప మళ్లీ ఎప్పుడు ఇవ్వలేదని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. అయితే నిర్మాణ పనుల పర్యవేక్షణ అధికారులు ×మాముల్లుగా తీసుకోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందనే విమర్శలు ఉన్నాయి.

నీటి కోసం 5 కి.మీ

నీటి కోసం గ్రామానికి 5 కి.మీ దూరంలో ఉన్న వాగు వద్దకు వెళ్లి కర్రలను ఎద్దులకు కట్టి వాటి సహాయంతో నీటిని తీసుకురావల్సిన పరిస్థితి. ఎద్దులు లేని వారు నెత్తిపై మోసుకుని రావాల్సిందే. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన సంక్షేమం కోసం విడుదల చేస్తున్నా వేలకోట్ల రూపాయలు తమ మౌలిక సదుపాయలు తీర్చలేకపోతున్నాయని ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కష్టమవుతుంది



పొద్దున, సాయంత్రం 5 కి.మీ వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నా. చాలా కష్టమవుతుంది. ఎద్దులు లేని వారు నెత్తిపై పెట్టుకుని నీటిని తెస్తున్నారు. మా కష్టం ఎవరికి రావద్దు. తమను ఎవరూ పట్టించుకోవడం లేదు.

– మర్సుకోల ఇందుర్‌బాయి

పట్టించుకోలేదు



గ్రామంలో కనీసం ఒక్క బోర్‌వెల్ వేసినా నీటి సమస్యను పరిష్కరించవచ్చు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. వాగులో నీళ్లు ఇంకిపోతే మా పరిస్థితి ఎలా ఉంటుందో భయం వేస్తుంది.

– అర్క పాపారావు

ప్రశాంతంగా ‘పది’ పరీక్ష



కెరమెరి: విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు

కెరమెరి: మండలంలోని కెరమెరి, మోడి పరీక్ష కేంద్రాల్లో గురువారం పదో తరగతి బయోసైన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండలంలోని కెరమెరి, గోయగాం, అనార్‌పల్లి, మోడి, కేజీబీవీ, హట్టి, రాంజీగూడ, ఝరి పాఠశాలలకు చెందిన మొత్తం 296 విద్యార్థులకు 293 మంది పరీక్షకు హాజరైనట్లు సీఎస్‌లు చంద్రశేఖర్, స్వర్ణలత, డీవోలు ప్రేమ్‌సింగ్, అచ్యుతానంద్ తెలిపారు. కెరమెరిలో 141, మోడి పరీక్ష కేంద్రాల్లో 155 మందికిగాను 152 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

కౌటాల: కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు గురువారం కొనసాగాయి. విద్యార్థులను ఉపాధ్యాయులు తనిఖీ చేసి కేంద్రంలోకి పంపించారు. జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 146 మంది విద్యార్థులకు గాను 146 మంది హాజరయ్యారని ఎంఈవో సోమయ్య తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 220 మంది విద్యార్థులకు గాను 220 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు చేపట్టారు.

రిక్షా కాలనీలో దొంగతనం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని రిక్షాకాలనీకి చెందిన వీవీ ప్రసాద్ ఇంట్లో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో 2 తులాల బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్సై మహేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

30న మండల సమావేశం

నార్నూర్: ఈనెల 30న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జవహర్ శుక్రవారం తెలిపారు. ఎంపీపీ కనక మొతుబాయి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు సకాలంలో పూర్తి నివేదికతో హాజరు కావాలని కోరారు.

వైద్యం అందక గేదె మృతి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని గంగన్నగూడలో వింతవ్యాధి సోకిన గేదె సకాలంలో వైద్యం అందక గురువారం మృతిచెందింది. గేదెకు చికిత్స అందించాలని సంచార పశువైద్యశాల (1962)కు ఫోన్‌లో సమాచారం అందించినా స్పందించలేదని బాధితుడు చునార్కర్ పత్రు తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే గేదె మృతిచెందిందని, దీనిపై విచారణ చేపట్టాలని వల్లకొండ ఎంపీటీసీ జమున మహేశ్ డిమాండ్ చేశారు. జిల్లా పశువైద్యాధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇసుక వేలం

రెబ్బెన: మండలంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఇటీవల సీజ్ చేశారు. మండల కేంద్రంలోని పశువుల సంత స్థలంలో భద్రపర్చిన 570 క్యూబిక్ మీటర్ల ఇసుకకు గురువారం వేలం నిర్వహించారు. రెబ్బెనకు చెందిన వ్యక్తి రూ.2.66 లక్షలకు ఇసుకను దక్కించుకున్నట్లు ఆర్‌ఐ ప్రేంకిరణ్ తెలిపారు.